వెంటనే ఇద్దరూ మళ్ళీ లేచి ఆ దుకాణంలోకి వెళ్ళారు. అతను జరిగింది చెప్పి ఆ డబ్బుని స్వీట్ షాపు యజమానికి తిరిగి ఇచ్చేసి చెప్పాడు.

"నాకు త్వరగా పావు కిలో కలాకండ్ ఇవ్వండి."

"మీలా నిజాయితీగా ఉండేవారు ఈ రోజుల్లో అరుదు. నేను టి.వి టెన్ వాళ్ళని పిలుస్తాను. మీ జంటని వాళ్ళు ఇంటర్వ్యూ చేస్తారు." షాపు యజమాని అభిమానంగా సూచించాడు.

"అవును. అందుకు మేం సాక్షులుగా ఉంటాం." చెప్పారు మిగతా కస్టమర్స్ కూడా.

"ఒద్దొదు. మాకు కలాకండ్ ఇచ్చి పంపండి చాలు." కోరాడు అతను.

ఎవరెంత చెప్పినా టి.విలో కనబడటానికి అతను ఇష్టపడలేదు. స్వీట్ పాకెట్‌ని తీసుకుని వారు వెళ్ళిపోయారు.

అతన నిజాయితీపరుడే కాక, ప్రచారం కూడా ఇష్టం లేని సుగుణవంతుడుగా అంతా భావించారు.

నిజానికి ఆఫీసు ఎగ్గొట్టి పొరుగూరు నించి వచ్చిన అతను తన గర్ల్ ఫ్రండ్‌తో గడుపుతున్నాడా రోజు. ఈ సంగతి తన భార్య టి.విలో చూసి తెలుసుకుంటే ప్రమాదమని అతను ఆ అవకాశాన్ని వద్దనుకున్నాడు. ఇదే విధంగా మనుషులంతా కనబడ్డంత మంచివారు అనుకోకూడదు. ఆధ్యాత్మికవేత్తలు, దైవ భక్తుల విషయంలో కూడా ఇదే నిజం వర్తిస్తుంది. కాబట్టి సాధకులు వారిని నమ్మేముందు జాగ్రత్తగా ఆలోచించాలి.

## 14. మాట తప్పితే...

చాలా చోట్ల ఉద్యోగాలకి ప్రయత్నాలు చేసి విఫలం అయిన ఓ నిరుద్యోగి ఓ అర్చకుడి సలహా మీద ఓ గుడికి వెళ్ళి దేవుడ్ని ప్రార్థించాడు.

"స్వామీ! నాకు ఉద్యోగం వస్తే నా జీవితాంతం నా జీతంలోంచి పది శాతం నీ హుండీలో వేస్తూంటాను. నాకు వచ్చే గురువారం లోగా ఉద్యోగం వస్తే అది నీ దయ వల్లే వచ్చిందని కూడా రూఢి అవుతుంది నాకు."

అతనికి గురువారానికల్లా ఉద్యోగం వచ్చింది. తన జీతంలోని పది శాతం అయిన వంద రూపాయలని అతను నెల నెలా ఆ దేవుడి గుడి హుండీలో వేయసాగాడు.

అతని జీతం పెరిగినప్పుడల్లా, హుండీలో వేసే డబ్బుని కూడా పెంచసాగాడు. చివరకి ఓ నెల అయిదు వందల రూపాయలు వేసాడు. కాని కొద్ది రోజుల తర్వాత అతను హడావిడిగా అర్చకుడి దగ్గరకి వచ్చి అడిగాడు.

"నేను దేవుడికి ఇచ్చిన మాటలోంచి బయట పడటం ఎలా?"

"ఎందుకని?" అడిగాడు అర్చకుడు.

"నాకు చాలా పెద్ద ప్రమోషన్ వచ్చి జీతం ఇప్పుడు నెలకి లక్ష రూపాయలైంది. నేను వందో రెండు వందలో అయితే వేయగలను కాని, చూస్తూ చూస్తూ పది వేలు తెచ్చి వేయలేను కదా?"

"నీ సమస్యకి పరిష్కారం చూపించమని దేవుడినే వేడుకో." సలహా ఇచ్చాడు అర్చకుడు.

అతను దేవుడ్ని అర్చకుడు చెప్పినట్లుగా ప్రార్థించి వెళ్ళాడు. మర్నాడు అతనికి ఉద్యోగంలో డిమోషన్ వచ్చింది. నెలకి వెయ్యి రూపాయలు జీతం వచ్చే పూర్వపు పోస్ట్‌లో తిరిగి చేరాడు.

## 15. దేవుడు ఎక్కడుంటాడు?

ఒకతనికి భగవంతుడు ఎలా వుంటాడో చూడాలన్న కోరిక కలిగింది. అతను అనేక మంది సాధువులని, సత్పురుషులని తనకి దేవుడ్ని చూపించమని కోరాడు. వాళ్ళంతా అది తమకి సాధ్యం కాదని నిరాకరించారు.

తమ వూరి బయట వనంలో ఓ జ్ఞాని వచ్చి బస చేసాడని తెలుసుకున్న అతను వెంటనే ఆయన దగ్గరకి వెళ్ళి వినమ్రంగా నమస్కరిస్తూ అడిగాడు.

"స్వామీ! నాకు మీరు భగవంతుడ్ని చూపించగలరా?"

"అంతటా వున్న భగవంతుడ్ని చూడకుండా ఎలా వుండ గలుగుతున్నావు?" వెంటనే అడిగాడాయన.